సామ - ఆది

సందెకాడ బుట్టినట్టి - చాయల పంట యెంత
చంద మాయ జూడరమ్మ - చందమామ పంట

మునుపు పాలవెల్లి - మొలచి పండిన పంట
నిను పై దేవతల - నిచ్చ పంట
గొనకొని హరి కన్ను - గొనచూపుల పంట
విను వీథి నెగడిన - వెన్నెలల పంట

వలరాజు పంపున - వలపు విత్తిన పంట
చలువ పున్నమి విర - జాజర పంట
కలిమి కామినితోడ - కారు కమ్మిన పంట
మలయుచు దమలోని - మట్టి మాని పంట

విరహుల గుండెలకు - వెక్కసమైన పంట
పరగ చుక్కలరాశి - భాగ్యము పంట
అరుదుగ తూరుపుకొండ - నార బండిన పంట
యిరవై శ్రీవేంకటేశు -నింటిలోన పంట

ఆంధ్ర సాహిత్యంలో ఆధ్యాత్మిక చంద్రుని ఉదయింపజేసినది ఇద్దరే. వారు అన్నమాచార్యులూ ధూర్జటి మహాకవీ. ధూర్జటి పద్యానికీ అన్నమయ్య పాటకీ ఉన్న సౌమ్యం మనోజ్ఞమనోహరమైనది. శ్రీకాళహస్తీశ్వర మహోత్మ్యంలో ధూర్జటి పద్యం -

ఉదయగ్రావము పానపట్టమభిషేకోదఃప్రవాహంబు వా
ర్ధిదరధ్వాంతము దూప ధూమము జ్వలద్దీ ప ప్రభారాజి కౌ
ముది తారానివహంబు లర్చిత సుమంబులాతమోదూర సౌ
ఖ్యదమై శీతగభస్తి బింబ శివలింగం బొప్పె ప్రాచీ దిశన్

తూర్పున చంద్ర బింబమనే శివలింగం పొద్దు పొడిచింది. తూర్పుకొండ పానవట్టమైంది ఆ శివలింగానికి సముద్ర జలమంతా రుద్రాభిషేక మొనరించిన జలరాశి.

కొంచెం కొంచెంగా మిగిలి ఉన్న చీకటి అగరువత్తుల పొగయై అలరించి ఆ చంద్రుని వెన్నెలల దీప్తులు దీపములయ్యాయి. ఆకాశమంతా పరుచుకున్న నక్షత్రాలు శివార్చన చేసిన మల్లెపూవులై వెల్లివెరిసినవి. అజ్ఞానతిమిరం తొలగి జ్ఞానాంకురమై రసోదయమై జగత్తుకు బ్రహ్మానందం అనుభవమైంది. ధూర్జటి పలుకులు నమకచమక సామ్రాజ్యపట్టాభిషేక మంత్రములయ్యాయి. మార్గకవితాశైలిలో.

అన్నమాచార్యులు ఆధ్యాత్మిక శృంగార చంద్రునిపంట ఈ దేశికవితా సంకీర్తనంలో పండించారు. సంధ్యాకాలంలో పుట్టిన ఈ చందమామ పంటను చూడండి ఎన్ని కళలతో వెలుగుతున్నదో అంటూ ఆ పంట ఎంతటి పర్వమైనపంటయో పలుకుతున్నారు.

క్షీర జలధిని మొలకెత్తి పండిన పంట అది. జ్యోతిశ్చక్రంలో గ్రహాలకు అమరులకు - అనుదినపు పంట. (చంద్రమంగళ, గజకేసరి, అనఫ, సునఫ దురుధర చంద్రాదియోగాలు చంద్రునివల్ల కలుగుతాయని జ్యోతిషశాస్త్రం) శ్రీమహావిష్ణుని కరుణాకటాక్ష వీక్షణల పంట ఆకాశంలో చల్లని వెలుగు వెల్లియల ఈ వెన్నెలపంట

మన్మధుడు పుత్తెంచగా జగత్తులో అందరి మనసులలో వలపు పంటకు విత్తనమైన వలపునారుపంట. చలువ పున్నమల కార్తీకపౌర్ణమి రాత్రులలో కన్నెలు జాజరపాటలు పాడే పంట, లక్ష్మీదేవి తోడబుట్టి, శ్రీసతితో వామనగుంటలాడిన సిరిపంట, రసాన్వేషులకు, చిత్తిపాసులకు అత్యల్పంగా ఆరంభమై అత్యున్నతంగా పెరిగే భక్తిజ్ఞాన వైరాగ్యముల మట్టిచెట్ల పంట ఈ చందమామ పంట.

విరహిజనులకు విరహతాపం హెచ్చించే పంట. నక్షత్రముల భాగ్యమైన పంట. (చంద్రుడు ఏ నక్షత్రంలో పూర్ణుడౌతాడో ఆ నక్షత్రం పేరు ఆ మాసానికి వస్తుంది. మన పంచాంగం చంద్రమానం. ఉదా-కృత్తికాతారలో పౌర్ణమి అయితే కార్తీకమాసం. చిత్రలో పౌర్ణమి అయితే చైత్రం ఇత్యాది గ్రహింపవలె). సకృతుగా తూర్పున పండే పున్నమి పంట (పౌర్ణమి నెలకు ఒక్కసారే వస్తుంది) శ్రీవేంకటేశ్వరుని అత్తవారింట్లో పండి ఆ స్వామి యింటికి అరణమై, సతమైన పంట అని సాహిత్యపరంగానూ, సహస్రార కమలాలలో ఉన్న లక్ష్మీనారాయణులపై కాంతులు జల్లే నిత్య కళాసహిత నిత్యపూర్ణ చంద్రుడని శ్రీవిద్యాయోగతంత్రపరంగానూ భావం.

ఈ వెన్నెలపంట పాటకు మంత్రం కూడా ఉన్నది 'ఓంహ్రీం చంద్రికే హంసా క్లీం స్వాహా' ఇది చంద్రికామంత్రం - అమృతసిద్ధికై సాధకులు వినియోగిస్తారు.